Abhiram

మా ఊళ్ళో వీధి అరుగు

పట్టణంలో ఉన్నప్పుడు పల్లెటూరికి పోయి ఉండాలనిపిస్తుంది. తీరా, పల్లెటూళ్ళో పట్టుమని పదిరోజులైనా ఉండలేను.

చాలా వింతగా తయారయ్యాను నేను. ఆలోచనలకీ, కోరికలకీ, బుద్ధికీ, నడవడికీ, దేనికీ, ఒకదానికొకటి సంబంధం లేదు; పొత్తు లేదు.

స్ఫుటమైన మూర్తి ఒకటి నా కింకా ఏర్పడినట్లు లేదు.

ఈ రోజుల్లో అందరూ నాలాగే ఉన్నారనిపిస్తుంది ఒకప్పుడు – ఎటూ తేల్చుకోలేక, ఎక్కడికి పోలేక.

అసలు పల్లెటూరికే మతిపోయినట్లుంది ఇప్పుడు. ఇదివరకు ఎలా గుండేది. పాపం, నిశ్చలంగా నిశ్చింతగా!

"కాలవ ఒడ్డున ఒరిగి నీడ చూసుకునేదో,
చేలనడుము పడుచులాగ చేయెత్తీ పిలిచేదో,
తోటవెనుక కాస్త కాస్త తొంగి తొంగి చూసేదో,
కొండపక్క నిలిచేదో,"

ఎంత తీయగా, చల్లగా ఉండేది
తెలుగు పల్లె!

ఇప్పుడు పల్లె కూడా మతి చెడగొట్టుకుంది – అనవసరంగా పట్టణం లాగ ఉండబోయి, అది చాతకాక.

నేనూ పల్లె ఒకలాగే ఉన్నాం.

కాఫీ హోటళ్ళూ, వాటినుంచి గ్రామఫోను రికార్డుల అరుపులూ, కిల్లీసోడాకొట్లులూ, బస్సుల సందడీ సినీమాలూ, వాటి తాలూకు ప్రకటనలూ – వాటి అన్నిటితో గ్రామం వేడుక కోసం నగరంవైపు మొగం తిప్పుకొని చూస్తున్నట్టుంటుంది. నగరం వీటి అన్నిటి మధ్యా ఊపిరాడక నలుగుతూ, అన్నం కోసం పల్లె వైపు చేతులు జాపుతున్నట్టుంటుంది.

పల్లె తల్లి వంటిది. పట్టణం ప్రియురాలు వంటిది.

అన్నం పెట్టడం, చల్లని అంకంమీద పవళింప జేసుకోవడం – గారాంగా పెంచుతుంది పల్లె.

ఆకర్షించడం, ఎప్పటికప్పుడు ఆవేశాలతో కదిలించి వేయడం గాఢంగా ఊపేస్తుంది పట్టణం.

"నీకేం గావాలి?" అంటుంది పల్లె, "నా కేమిస్తావు?" అంటుంది పట్టణం.

అంతేగాదు. పల్లె కుటుంబంలాగ, సంసారంలాగ ఉంటుంది. పట్టణం సంతలాగ విపణిలాగ ఉంటుంది.

గ్రామంలో కాలాలు తెలిసిపోతాయి – ఎండా, వానా, వెన్నెలా, వీటితో స్పష్టంగా. పట్టణానికి ఋతువులు లేవు; అందువల్ల, పట్టణంలో ఉన్న చెట్లూ, చేమలూ, లతలూ, పువ్వులూ, పక్షులూ, బిక్కచచ్చి ఉంటాయి, దిగులుగా ప్రవాసంలో ఉన్నట్టు.

పట్టణంలో పదిమందిలో ఒంటరిగా ఉంటాం. పల్లెలో మనిషీ, చెట్టూ, చేమా, పిట్టా, జంతువూ కలిసి ఒకే ఒక కుటుంబం.

ఈ సందర్భంలో నాకొకటి వింతగా కనబడుతుంది. ఇళ్ళల్లోనూ, ఇళ్ళు కట్టడంలోనూ.

పట్టణాల్లో కొత్తరకపు ఇళ్ళు లేస్తున్నాయి. ఇవి దాదాపు ఒకే రకంగా ఉంటాయి.

కొన్నింటికి చుట్టూ గోడలు ఉంటాయి, లోపలికి రావడానికి వీలులేదన్నట్టు. ఎన్నిటికో గోడలు లేకపోయినా వీధి అరుగులుండవు.

ఇలాంటి ఇళ్ళు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి యిప్పుడు. ఈ ఇళ్ళు ధుమధుమలాడుతూ, మొహం చిట్టించుకొని, వీధివైపు వీపు త్రిప్పినట్లుంటాయి.

గ్రామాల్లో ఇళ్ళకు వీధి అరుగులుండేవి. పెద్దవాళ్ళ ఇంటికి మరీ పెద్ద అరుగులుండేవి.

వీధి అరుగు ఆహ్వానం వంటిది. మొదటి ఆతిథ్యం వీధి అరుగే ఇస్తుంది. అతిథులో, అభ్యాగతులో, బాటసారులో, అందరినీ ఇలా దయచేయండి అంటుంది వీధి అరుగు.

వీధి అరుగు స్వాగత వచనం వంటిది.

గ్రామంలో వీధి అరుగు గొప్ప సంస్థ

ఇంటికి తగిన అరుగు ఉండేది మునువు. ఇప్పుడు అరుగు హరించుకు పోతూఉంది క్రమంగా.

మా ఊళ్ళో చెప్పుకోదగ్గ అరుగులు నాలుగు ఉండేవి – కరణం జగ్గరాజు మావయ్యగారిదీ, మునసబు శేషాద్రిగారిదీ, దివాణందీ అంటే వెలమ దొరగారు వెంకట్రాయణిం గారిదీ, మరీ మాదీ అంటే పెద్ద శాస్త్రులు గారిదీని.

ఇవే, సమయాన్ని బట్టి, చేరిన జనాన్ని బట్టి, కచేరీ లయ్యేవి; క్లబ్బులయ్యేవి; సభాస్థలాలయ్యేవి.

కరణంగారి వీధి అరుగూ, రాయణింగారి వీధి అరుగూ గచ్చువీ, పెద్దవీ.

రాయణింగారి అరుగు గచ్చు నిగనిగమంటూ నున్నగా మెరుస్తూ ఉండేది. అరుగంటే నిజానికి రెండు అరుగులు – వీధి గుమ్మానికి అటూ ఇటూ, దివాణపు టరుగుల మీద తివాసీలు పరచి ఉండేవి. కాని, చల్లటి గచ్చుమీదే కూర్చోవాలని ఉండేది మాకు. ఈ అరుగుల మీద ఇటూ అటూ జేరగిలబడ్డానికి, గచ్చు బాలీసులుండేవి. అరుగులమీద ఒకవైపు రెండు సవారీ లుండేవి – చక్కగా చెక్కిన అద్దలూ, సోగదండెలూ, దంతపుకోళ్ళూ, రాయంచ రెక్కలతో పరుపు బాలీసులూ, "వింతపని చక్కీల్ పెంజరీ పింజరీల్"; మొదలైన వాటితోనూ.

పెద్దలు మాట్లాడుకుంటూంటే పిల్లలం ఆ సవారీలో సరదాగా కూర్చునేవాళ్ళం. ఆ అరుగుల మీద ఉన్న కిటికీలలో నుంచి దివాణం లోపలి భాగం కనబడేది.

నగిషీ పనుల మించు నిగనిగజిగిగుల్కు
కంబముల్ దూలముల్ గలిగి, వింత
సంతున దగు చాకచక్యంబు పల్కల
జిగిసరంబీ క్రింద జిల్గుమేల్ క
లంకారి చాందినీ, లాంతరుల్ వెలుగ, ము
క్తాచూర్ణ పరిలిప్త ధాగధగ్య
బిత్తి భాగాది శోభిత గోపగోపికా
బహుళకేళీ చిత్రపటము లమర,
తళుకు లిల జిల్కు నిల్వుటద్దముల గములు
మరి, హ మీరు పసం దైన ఫరుషు గల్గి" –

అద్భుతంగా మరోలోకపు ప్రాసాదాన్ని తలపించేది. దీనిని గూర్చి మరోసారి.

రాయణింగారి లోగిటి వీధి అరుగు మా ఊళ్ళో క్లబ్బు వంటిది. దీనికి గూడా రాయణింగారికి లాగే ప్రాభవమూ బడాయీ ఎక్కువ. ఇక్కడ అందరూ అన్ని పనులమీదా చేరగూడదు, వీల్లేదు. పెద్దచందాలిచ్చే సభ్యత్వం లేకపోయినా ఊళ్ళో కొందరు పెద్దలే ఇక్కడ చేరేవారు. ఆ చేరడమున్నూ సాయంకాలాలే.

ఇక్కడ కాస్త కరణం మునసబుల వీధి అరుగులను గూర్చి నాలుగు మాటలు చెపుతా.

అవి కచేరీలు.

కరణం గారి వీధి అరుగుమీద పాత తివాసీ ఉండేది – కొంత నలిగి, ఎంతో రంగు పోగొట్టుకొన్నది.

ఒక పక్కన గోడ నానుకుని ఆయన కూర్చుంటే ముందుగా చిన్న డెస్కు బల్లఉండేది.

కరణం జగ్గరాజు మామయ్యగారి కచేరీ వేషం మహా బడాయిగా ఉండేది – "తెలితలపాగ, చొక్క, మొలతిత్తి భుజంబున చల్వపచ్చడంబు, అలచిటిమ్రేల ముద్రిక, ఒయారము మీర పొగాకు చుట్ట, సొం పలరెడు కావి ధోవతి, పదాబ్జ యుగంబున ముచ్చెలున్నూ." ఇవి గాక కళ్ళజోడు ఉండేది. అది ఒకప్పుడు నుదుటిపై కెక్కేది, ఆయన ఠీవిగా పరిశీలించేటప్పుడు. అది మరొక్కప్పుడు ముక్కు కొనకు జారేది, ఆయన సూటిగా పరీక్షించేటప్పుడు.

మునసబు శేషాద్రిగారి వీధి అరుగు గచ్చుకన్నా కూడా నిగనిగలాడుతూ గట్టిగా నున్నగా ఉండేది – మట్టితో అలికిన దైనా! ఈ అరుగు మొగాన జేవురు మట్టిచార లుండేవి. దీని మీద పెద్దపెద్ద తుంగ చాపలు. ఆ చాపలకొకమూల తుంగలు తుంచి ఉండేవి – వచ్చినవాళ్ళు తోచక పెరకడంవల్లో, పళ్ళు కుట్టుకుందుకో నమలడానికో పీకడం వల్లో!

మునసబు అరుగుమీద కూడా ఒక సవారి ఉండేది.

పెద్ద పట్టెనామాలూ, ఎర్రచారల నిడుపాటి కళ్లూ, కొటేసిన గరుడుముక్కూ, ముందు ముళ్ళుగట్టుకునే అంగరఖా, తలవెనుక పై భాగానికి లాగి గోపురంలాగా కట్టిన జుట్టుముడి, వెండిపొన్ను పెద్దకర్రా వీటితో మా మునసబు అంత ఠీవైన విగ్రహాన్ని నేను దరిమిలాని, చూడలేదు.

కరణంగారి వీధి అరుగూ, మునసబు వీధిఅరుగూ కచేరీలు అన్నాను గదూ!

అవి సాయంకాలం దాకా సందడిగా ఉండేవి. ముఖ్యంగా కరణంగారి వీధిఅరుగు. కిస్తీలూ, జప్తులూ, మందడిగోడల ఫిర్యాదులుగా, బందెలదొడ్లూ, చేలగట్ల వివాదాలూ, సర్వేరాళ్ళూ, రెవిన్యూ ఇనస్పెక్టర్ల దురంతాలు, తాసిల్దారు గారికి సప్లయిలూ, బోర్డు ఎన్నికలూ, రౌడీ సుబ్బన్న పోకిరీ చేష్టలూ, అన్నదమ్ముల ఆస్తి పంపకాల తాలూకు వివాదాలూ, అచ్చెమ్మ విడాకులూ, పట్టణంలో కోర్టు సాక్ష్యాలకు తయారీలు – ఇలాటి వాటిమీద కరణం మునసబుల మంత్రాంగాలూ, చర్చలూ, నిర్ణయాలూ తీర్పులూ, ఈ అరుగుల మీద జరిగేవి.

ఇక్కడికి అన్ని తరగతులవారూ వచ్చేవారు. వచ్చి తాహతును బట్టి కొందరు పైన అక్కడా అక్కడా కూర్చునేవారు. పాగాలవారూ, జుట్టు ముళ్ళవారూ, జునపాలవారూ, బొత్తాలు లేని చొక్కాలవారూ, దిసమొండెములవారూ, పెద్దలూ, పిన్నలూ, రకరకాలు!

కొందరు అరుగుమీద కూర్చుండుకు తాహతు లేనివారు, కింద నిలబడి తమ గోడు చెప్పుకొనేవారు.

మరికొందరు అరుగుమీద వేంచేయడానికి తమకే అవసరమూ లేదన్నట్లు నిర్లక్ష్యంగా క్రింద నిలబడి, ఒక చంక కింద పొన్ను గర్ర నిలబెట్టి, రవంత ఆ పక్కకు ఒరిగి, లంకాకుచుట్ట కాలుస్తూడండం వల్ల నడుమ తుపుక్కున ఉమ్మేస్తూ, అరుగువైపు చూడకుండానే అక్కడ జరిగే వ్యవహారాల్లో కలుగజేసుకొంటూ ఉండేవారు.

కొందరు స్త్రీలూ తమ గొడవ చెప్పుకోవలసి వచ్చి, అరుగు పక్క చాటుగా, ఒదిగి నిలబడి ఉండేవారు.

దూరాన అరుగుమీద ఓమూల ఒక పరదేశి మూటతో కూర్చుని ఉంటాడు.

ఈ వ్యవహారాల తీర్పులో నడుమ నడుమ ఎవరో ఒకరు ఛలోక్తులు విసరుతారు.

ఒకడనవసరంగా కలుగజేసుకొని చీవాట్లు తింటాడు.

పనిలేకుండా వచ్చినవాళ్లు అక్కడక్కడ కూర్చుని ఇద్దరు ముగ్గురు తమ తమ తీర్పులు కూడా ఇస్తుంటారు.

సాయంకాలం మూడుగంటల నుండి దివాణపు వీధి అరుగు. ఇక్కడికి కరణం మునసబులు వస్తారు; కలకాపులు వస్తారు; మేష్టారు వస్తారు; సిద్దాంతీ షావుకారూ కూడా వస్తారు; శాస్తుల్లుగారు వస్తారు. రాయణింగారు సరేసరి.

వీరందరు అరుగుమీద సభ తీర్చినప్పుడు, ఆ వీధివెంట నిరాఘాటంగా అందరూ వెళ్ళడానికి జంకేవారు – మా ఊరిలో ఉన్న పెద్ద ఆబోతు తప్ప!

దాని దర్జాయే వేరు. పెద్దనూపురం అదీ, వెండి కొండలా కదిలివస్తూ, ముందు పెద్ద రంకెవేసి, దివాణపు టరుగును రాసుకుంటూ వచ్చి, మధ్య మెట్లమీద మునికాళ్ళు పెట్టి నిలబడేది. తక్షణం దొరగారు నౌకరువైపు చూసేవారు. వాడు పోయి చాటెడు బియ్యం పోసి తెచ్చి దానికి పెట్టేవాడు.

ఇంతలో ఆ వీధినే తుర్రుమని ఒక పంది అటు పరిగెత్తేది; చెంగున ఇటు ఒక లేగదూడ బంతిలా ఎగిరి వెళ్ళిపోయేది.

ఊరి బావినుండి నీళ్ళు తెస్తున్న అమ్మలక్కలు, అంతవరకూ కిలకిల మాట్లాడేవాళ్ళు, ఒక్కసారి ఆగిపోయి, నిశ్శబ్దంగా తలలు రెండోవైపు తిప్పుకొని నడిచిపోయేవారు. వాళ్ళ అందెల రవళిలో రవ్వంత ఒడిదుడుకూ, వాళ్ళ కడవల నీళ్ళలో రవ్వంత తొట్రుపాటూ, వాళ్ళ మనస్సులు దివాణపు టరుగుమీదనే ఉన్నాయని తెలియపరుస్తున్నప్పటికీ.

ఇంతలో సీమదేశాల్లో యుద్ధాన్ని గురించో, చంద్రలోక యాత్రను గురించో, కబుర్లు వస్తాయి. ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతారు. వెటకారంగా చిరునవ్వుతూ కరణంగారు ఆఖరిమాట చెప్పడానికి చూస్తూ ఉంటారు. తమ పూర్వులైన వీరుల్లో ఒకరుంటే చాలు, ఈ యుద్ధాలు చిటికెలో తేలిపోయేవని దొరగారు చెప్తారు. కాలికి పసరు పూసుకొని హిమాలయాలకిన్నీ, ఇట్టే చేతులు జాపి కాళ్ళెత్తి చంద్రగోళానికిన్నీ, మన పూర్వులు చటుక్కున వెళ్ళి, మళ్ళీ సాయంకాలానికి ఎలా తిరిగివచ్చేసేవారో సిద్ధాంతిగారు విశదంగా తెలియబరుస్తారు.

రెండో అరుగుమీద పేకాట జరుగుతూ ఉంటుంది.

ఒక్కొక్కప్పుడు వీధి అరుగులముందు, తూర్పు నుంచి రాజుగారు పంపిన పుంజుకీ, రాయణింగారి పుంజుకీ,పోట్లాట జరుగుతుంటే, అందరూ చూస్తారు. కౌఁజుపిట్టలది కూడా. దొరగారు, కౌఁజుల్నీ, పుంజుల్నీ నాణెం గట్టడంలో గొప్పవారు. వీటి పోట్లాటల సమయంలో మాత్రం గ్రామంలో చాలామంది వీధిలో మూగుతారు. కొందరు పిల్లలు చొరవ చేసి దివాణపు మెట్లు ఎక్కి, అరుగుల మీదకి రాబోతుంటే, పెద్దలు వాళ్ళను తరిమేస్తారు.

రాత్రి శాస్త్రిగారి వీధిఅరుగు. దానిముందు ఖాళీ స్థలంలో జరిగే పురాణపఠనం సంగతి మరోసారి.

ఇలాగ కరణం మునసబుల వీధి అరుగులు గ్రామస్థుల నిత్యలౌకిక జీవితానికీ, దివాణం వీధి అరుగు వేడుకలకీ కాలక్షేపానికీ, శాస్త్రిగారి వీధి అరుగు ధర్మచింతనకీ ఆముష్మిక గోష్ఠికీ కేంద్రాలై ఉండేవి.

కాక కుట్టుపని దానయ్య అరుగుండేది. దానిమీద మిషన్ టకటకలాడిస్తూ ఉండేవాడు.

సిద్ధాంతిగారి చిన్న అరుగుండేది. ఇక్కడ ఆయనచేత చెవిటి సుబ్బయ్య - వినిపించకపోయినా - న్యూస్‌పేపర్ చదివించుకొనేవాడు.

ఇలాగే ప్రసిద్ధమైన అరుగులు కొన్ని ఉండేవి.

అయితే ఈ మధ్య వీధుల్ని వెడల్పు చెయ్యడంలో అరుగులు కొన్ని కుదించుకుపోయాయి.

కొన్ని అరుగులు గదులైపోయాయి. సిద్ధాంతిగారి వీధి అరుగు అటువంటిది. దానిలోకి వచ్చింది దానయ్య కుట్టుమిషన్.

కాని కాలం వచ్చి రాయణింగారు చితికిపోవడంవల్ల వారు దూరాలకు వలసపోవడమున్నూ, తరువాత కుమారుని ఉద్యోగానికై పట్టణవాస మేర్పరచు కోవడమున్నూ, దివాణపులోగిలి లోపలకూలి దిగబడిపోయి అరుగుల మీద అందంగా చెక్కిన స్తంభాలు మాత్రం మిగిలిపోయాయి. ఇప్పుడు ఆ దారిన ఆబోతే కాక అందరూ ధాటీగా మాట్లాడుకుంటూ పోతున్నారు.

కరణంగారు వృద్ధులవడం వల్ల, ఇతర కారణాల వల్ల కుంగిపోయిన గుడారంలాగ అయిపోయి అరుగుమీద చదికిలబడి కూర్చుంటారు. ఇప్పుడు దానిమీద ఆట్టే కచేరీలు జరగడం లేదు.

శాస్త్రిగారు పరమపదించడం వల్ల, వారి కుమారుడు ఇంగ్లీషు చదువుకొని, ఎక్కడికో ఉద్యోగానికి వెళ్ళిపోతే ఆ ఇల్లు బోర్డువారు 'ఎక్వైరు' చేసి అరుగుల మీద క్లాసుల కోసం గదులు కట్టారు.

మునసబుగారి వీధి అరుగు ఇంకా సందడిగానే ఉంది. అయితే, అక్కడ ఇప్పుడు ఎన్నికలగోలా పార్టీల కోలాహలమున్నూ.

✡ ✡ ✡